క్లుప్తంగా

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



చిలకలూరిపేట: ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మోజెస్ అనే దివ్యాంగుడికి శుక్రవారం ట్రైసైకిల్ ఉచితంగా అందజేశారు. దీంతో పాటు రాజేష్ అనే వ్యక్తికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందించారు. తిమ్మాపురం లైబ్రరీకి అవసరమైన పుస్తకాలు, ఆట వస్తువులు బహూకరించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ మాట్లాడుతూ తిమ్మాపురం లైబ్రరీ అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని భవిష్యత్‌లోనూ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కె.విజయలక్ష్మి, సభ్యులు డాక్టర్ ప్రఫుల్లాదేవి, ఇందుమతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు వి.రెడ్డిపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం

నరసరావుపేట: రొంపిచర్ల మండలంలోని వి.రెడ్డిపాలెం గ్రామంలో శని, ఆదివారాల్లో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. సాయంత్రం 5గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో అధికారులతో పాల్గొని ఇంటింటికీ తిరుగుతూ అందుతున్న సంక్షేమ పథకాలను గురించి తెలియచేస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకోవటం జరుగుతుందన్నారు. కావున పార్టీ బాధ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా వల్లభేశ్వరిస్వామి వార్షికోత్సవం


రొంపిచర్ల: మండలంలోని విప్పర్ల గ్రామంలో వేంచేసి ఉన్న వల్లభేశ్వరి స్వామి ఆలయ పంచమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవాచనం, దీక్ష ధారణ, మంటపారాధన, కలశస్థాపన, స్వామివారికి అభిషేకం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్ర, చండీ హోమాలు, మూలవిరాట్ సహిత ఉపదేవత మూలమంత్ర హోవనములు, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం వేళ స్వామి వారికి కుంభాభిషేకం, కల్యాణం, ఆశీర్వచనం, మహా మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలు బ్రహ్మశ్రీ చంద్రశేఖర అవధానుల ఆధ్వర్యంలో ఏకాహ్నిక దీక్షతో వైదిక శాస్త్రానుగుణంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షల నిర్వహణ



చిలకలూరిపేట: పురపాలక సంఘంలో విలీన గ్రామమైన మానుకొండవారిపాలెంలో డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ఫేజ్–3లో భాగంగా వృద్ధులకు శుక్రవారం కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. మానుకొండవారిపాలెంలోని సచివాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ ఎల్. ప్రసాద్‌నాయక్, ఆప్తాల్మిక్ ఆఫీసర్ మురళికృష్ణ పాల్గొని 47 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 42 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించడంతో పాటు ఐదుగురికి శుక్లాల ఆపరేషన్ నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఏళ్లు పైబడిన వారికి, కంటి చూపు మందగించడం, ఆర్థిక స్థోమత లేని వారికి వైఎస్సార్ కంటి వెలుగు పథకం ఒకవరం వంటిదని పేర్కొ న్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్‌కె అజీజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పిన్నీసు మింగిన నాలుగేళ్ల చిన్నారి!



నరసరావుపేట: ఆకతా యితనంగా తెరుచుకుని ఉన్న పిన్నీసును మింగిన నాలుగేళ్ల చిన్నారి అన్నవాహిక నుంచి ఆ పిన్నీసును తొలగించి కాపాడిన ఉదంతమిది. శుక్రవారం రవీంద్ర గ్యాస్ట్రో అండ్ లివర్ కేర్ హాస్పిటల్స్ అధినేత డాక్టర్ కంఠమనేని రవీంద్ర తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి గురువారం రాత్రి అన్నం తింటూ తెరిచిన పిన్నీసును ఆటకాయతనంగా నోట్లో పెట్టుకొని మింగేసింది. కొద్దిసేపటికి వాంతులు కావడంతో కుటుంబసభ్యులు ఆందోళన గుర్రై పల్నా డురోడ్డులోని తమ హాస్పిటల్‌లో తీసుకొచ్చారన్నారు. ప్రాథమిక పరీక్షలు చేసి ఎక్సరే తీయగా పిన్నీసు అన్నవాహికకు గుచ్చుకొని మధ్యలో ఆగిపోవడం గుర్తించామన్నారు. దీనిని వెంటనే ఆప రేషన్ ద్వారా తొలగించాల్సిన అవసరం ఉందని కుటుంబసభ్యులకు తెలియచేసి వారి అనుమతి తో రాత్రి 12 గంటల ప్రాంతంలో ఎనస్తీషియా డాక్టర్ అవినాష్ పర్యవేక్షణలో ఎండోస్కోప్ విధా నంలో అత్యంత చాకచక్యంగా అన్నవాహికకు గుచ్చుకొని ఉన్న పిన్నీసును పొట్టలోకి తీసుకొచ్చి తీసేటప్పుడు మిగతా శరీర భాగాలకు తగలకుండా, రంధ్రాలు పడకుండా జాగ్రత్తగా బయటకు తీయడం జరిగిందన్నారు. డాక్టర్ అవినాష్, వైద్య సిబ్బందికి తల్లితండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

జగనన్న పాలనలో ప్రగతిపథం వైపు కుటుంబాలు

- పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగనన్న పాలనలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ప్రగతిపథం వైపు పయనిస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. మండలంలోని కావూరు గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో తెలియజెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కుటుంబం బాగుపడేలా సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత జగనన్న రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని పేర్కొన్నారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్ధవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవినేని శంకరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు కోడె సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తా యాములయ్య, కక్కెర శ్రీనివాసరావు, నాగబైరు వెంకట్, కందుల ఆంజనేయులు, చినబాబు, గుమ్మడిదల నాగేశ్వరరావు, జెత్రిపోతుల కరుణామయుడు, బోడియ్య, అంకమ్మ, ఇజ్రాయేలు, రమణయ్య, కందుల వీరయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం

ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ (నూజెండ్ల): నిరుద్యోగ నిర్మూలనే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిశ్రమల నిర్వాహకులకు చేయూతనందిస్తూ పెట్టుబడులను రాబట్టడమే కాకుండా యువతకు ఉపాధి కల్పించేందుకు ఎనలేని కృషి చేస్తున్నారని స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల నందు 2వ విడత మెగా జాబ్‌మేళాను పల్నాడు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సంజీవరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి తరుణంలో యువత తమ చదువు ముగించుకుని కళాశాల నుంచి బయటకు వచ్చే సమయంలోనే క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా జీవనోపాధి పొందుతున్నారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యువత తమ కాళ్లపై నిలబడేందుకు కృషి చేస్తూ ప్రాథమిక స్థాయి నుంచే ఉద్యోగ అవకాశాలపై దృష్టిసారిస్తూ ముందుకు వెళ్లడం శుభపరిణామన్నారు. ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకుని తమకంటూ ప్రత్యేక జీవితాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. వల్లభ మిల్క్ డెయిరీ ప్రొడక్ట్స్, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, పిన్‌కేర్ స్మార్ట్ ఫైనాన్స్ బ్యాంక్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్‌తో పాటు పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. మొత్తం 498 మంది హాజరు కాగా 236 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా అధికారి సంజీవరావు తెలియజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బి.బాలునాయక్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ అధికారి వరలక్ష్మి, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు రామాంజనేయులు, రవీంద్రనాయక్, కోఆర్డినేటర్స్ వీరాంజనేయులు, రామకృష్ణ, జానీబాషా, రమ్య, శ్రీకాంత్, మణికంఠ గోపాల్, కౌన్సిలర్లు షేక్ షకీలా, రెడ్డి నాగపద్మ, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు

హెచ్చరించిన జేసీ శ్యాంప్రసాద్



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ శ్యాంప్రసాద్

వినుకొండ(నూజెండ్ల): రైతన్నకు మిరప విత్తనాలు అధిక రేట్లకు విక్రయించినట్లయితే కఠినచర్యలు తీసుకోవడం జరుగుతుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ హెచ్చరించారు. పట్టణంలోని ఎరువులు, విత్తన దుకాణాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్లాసిక్ మిరప విత్తనాలను ఎంఆర్‌పీల కంటే ఎక్కువ రేట్లకు విక్రయిస్తున్నట్లు తమకు రాబడిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేయడం జరిగిందన్నారు. తనిఖీలో భాగంగా జయలక్ష్మి సీడ్స్ ఏజెన్సీలో రికార్డులను పరిశీలించగా రికార్డులు సవ్యంగా ఉన్నాయని, దుకాణదారుడు 30 ప్యాకెట్ల రికార్డును చూపించ లేదని, రికార్డులు తనిఖీ చేసి స్టాక్ సరిగ్గా లేకుంటే వాటిపై అమ్మకాలు నిలపాలని ఏడీఏ రవిబాబు ఆదేశించారు. ఇదిలా ఉండగా దుకాణంలో జేసీ తనిఖీ చేస్తున్న తరుణంలో ఆ ప్రాంతంలో ఉన్న ఎరువులు, విత్తనాల షాపులు మూసివేయడంతో జేసీ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ దుకాణాదారులను వివరణ కోరి సరైన వివరణ ఇవ్వని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ కిరణ్‌కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామోదయం

వినుకొండటౌన్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గ్రామోదయం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. ఉప్పరపాలెం గ్రామంలో శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఇర్లపాడులో 'గ్రామోదయం'



ఉపాధి కూలీలకు వోఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు అందజేస్తున్న అధికారులు

శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో గ్రామోదయం కార్యక్రమం మండలస్థాయి అధికారులు శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు షేక్ జాన్‌సైదులు మాట్లాడుతూ కలెక్టరు ఆదేశాలు మేరకు గ్రామోదయం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటరు సందర్శించి చిన్నారుల గర్భిణుల రక్తహీనత నియంత్రణకు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. ఫ్యామిలీ వైద్యాధికారి కార్యక్రమం పనితీరు నిర్వహణ తీరును పరిశీలించారు. ఉపాధి కూలీల హాజరు పరిశీలించి వోఆర్ఎస్ ద్రావణం ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, వైద్యాధికారి సయ్యద్ ఇబ్రహీం, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, కార్యదర్శి కోమటినేని అశోక్‌చౌదరి, వీఆర్వో అక్కయ్య పాల్గొన్నారు.

అప్పాపురంలో..

నాదెండ్ల: మండలంలోని అప్పాపురం గ్రామంలో మండలస్థాయి అధికారులు శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ఏవీ రమణ, ఎంపీడీవో జాకీర్‌హుస్సేన్, మండల స్థాయి అధికారులు గ్రామంలో పర్యటించారు. పారిశుద్ధ్య నిర్వహణపై అన్ని వీధుల్లో తిరిగి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం పరిశీలించారు. ఐ లవ్‌రీడింగ్ కార్యక్రమం నిర్వహించి చిన్నారులతో మాట్లాడారు. గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వాటర్ స్కీం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో ఆంజనేయులు, ఏఈ పీఆర్ రమణారెడ్డి, సీడీపీవో శాంతకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యతేజ, వైద్యాధికారి సాయిశ్వేత, వైసీపీ నాయకులు పద్మ, మూసా, పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

మాజీ సైనికుని దాతృత్వం అభినందనీయం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నరసరావుపేట రూరల్ : మాజీ సైనిక సంక్షేమ కార్యాలయం కోసం లక్షలు రూపాయలు విలువ చేసే భూమిని ఉచితంగా ఇచ్చిన రొంపిచర్ల మండలం రామిరెడ్డిపాలెం గ్రామ మాజీ సైనికుడు బీరం భాస్కర్ రెడ్డి అభినందనీయుడని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. స్థానిక అల్లూరివారిపాలెం రోడ్డులో నూతనంగా నిర్మించిన మాజీ సైనికుల సంక్షేమ సంఘ భవనాన్ని శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, పౌడా చైర్మన్ మిట్టపల్లి రమేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గోపిరెడ్డి మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో భూముల విలువ పెరిగాయని, ఇటువంటి సమయంలో మాజీ సైనికుల కోసం సుమారు రూ.10 లక్షల విలువచేసే స్థలం, భవనం నిర్మాణం కోసం వెచ్చించటం భాస్కర్ రెడ్డి దాతృత్వానికి నిదర్శనమన్నారు. తాను కూడా కోరుకొండ సైనిక స్కూలులో చదివానని, తన స్నేహితులు 30 మంది వరకు ఆర్మీ, నావీ, ఎయిర్‌ఫోర్స్ విభాగాల్లో పని చేస్తున్నారని ఎమ్మెల్యే వెల్లడించారు. దేశం లోపల ప్రజలందరూ ప్రశాంతంగా బ్రతుకుతున్నారంటే సైనికుల త్యాగ ఫలితమే కారణమన్నారు. వారికోసం తనవంతు సహకారం అందజేస్తామన్నారు. స్థలానికి సంబంధించిన పత్రాలను సంఘ ప్రతినిధులకు అందజేసి భాస్కరరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఏపీ రాష్ట్ర సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్, విశ్రాంతి బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, మాజీ సైనిక సంక్షేమ సంఘ కార్యదర్శి మధిర సత్యనారాయణరెడ్డి, మాజీ సైనికులు పాల్గొన్నారు.

చినకంచర్లలో ప్రతిష్ఠా మహోత్సవాలు

శావల్యాపురం: మండలంలోని చినకంచర్ల గ్రామంలో నూతన దేవాలయాల ప్రతిష్ఠా కార్యక్రమాలు శుక్రవారం సాయంత్రం నుంచి ప్రారంభమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామస్తులు దాతలు సహకారంతో నూతన దేవాలయాలు శ్రీకోదండ రామస్వామి, శ్రీ లక్ష్మీనరసింహస్వామి, బొడ్రాయి, జీవధ్వజ విగ్రహాలు ఈనెల 31న ఉదయం 8.12 నిమిషాలకు వైభవంగా జరుగుతాయన్నారు. తొలిరోజు పుణ్యాహవచనం, కంకణధారణ, అంకురార్పణ హోమం తదితర పూజ కార్యక్రమాలు వైభవంగా గ్రామస్తుల సమక్షంలో నిర్వహించారు. చివరిరోజు భారీ అన్నదానం కూడా ఏర్పాటు చేశామన్నారు.

నేడు మున్సిపల్ సమావేశం

చిలకలూరిపేట: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని తెలిపారు. మైలవరపు గుండయ్య కౌన్సిల్ హాలులో నిర్వహించే ఈ సమావేశానికి కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు హాజరుకావాలని కోరారు.

29నుంచి గాయత్రీ పరివార్ ఉత్సవాలు

రొంపిచర్ల: మండలంలో అచ్చయ్యపాలెం గ్రామంలో ఈ నెల 29, 30 తేదీలలో గాయత్రీ పరివార్ ఉత్సవాలు జరుగుతాయని సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విశ్వశాంతి విశ్వ విద్యాలయంలో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మొదటి రోజున 108 కలశముల శోభాయాత్ర, రెండవ రోజున మహాయజ్ఞం, పూర్ణాహుతి జరుగుతాయన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

వినుకొండ టౌన్: మైనర్లు వాహనాలను నడపడం ద్వారా రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారకులౌతున్నారని, అటువంటి వారికి వాహనాలు ఇచ్చి ప్రోత్సహించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని పట్టణ సీఐ సాంబశివరావు హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు వాహనాలు నడుపుతున్న మైనర్లను గుర్తించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా పట్టణంలో వాహనాలు నడుపుతున్న దాదాపు 100 మంది మైనర్లను శుక్రవారం నిర్వహించిన డ్రైవ్‌లో గుర్తించడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి ఒక్క వాహన యజమాని, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట పట్టణ ఎస్ఐ రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్ దుర్మరణం

నరసరావుపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో కార్పెంటర్ మృతి చెందిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదతురకపాలెంకు చెందిన సయ్యద్ నాగుర్ సైదా(32) ప్రతిరోజూ నరసరావుపేటకు వచ్చి కార్పెంటర్ పనిచేస్తూ ఉంటాడు. ఈ క్రమంలో ఉదయం తన స్నేహితుడు మౌలాలితో కలిసి ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వచ్చాడు. మార్గమధ్యంలో బాబాపేట కళ్యాణి పెట్రోల్ బంక్ వద్ద వాహనానికి పెట్రోల్ పోయించుకుని చిలకలూరిపేట రోడ్డు ఓవర్ బ్రిడ్జి మలుపు తిరుగుతుండగా ఎదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ క్షతగాత్రుడిని సమీపంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఎస్ఐ రాజానాయక్ సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరో యువకుడికి గాయాలు



మృతుడు మర్రిపూడి సతీష్

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా బాలుడికి గాయాలైన సంఘటన శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెంకు చెందిన మర్రిపూడి సతీష్ (25) ప్రకాశం జిల్లా ఒంగోలులో పుట్టింటిలో ఉన్న భార్య వద్దకు శుక్రవారం సాయంత్రం బైక్‌పై బయలుదేరాడు. యడ్లపాడు మండలం తిమ్మాపురం చేపల చెరువు వద్దకు రాగానే రోడ్డు దాటుతున్న బాలాజీ అనే వ్యక్తిని తప్పించబోయి క్రమంలో వాహనం ఢీకొంది. దీంతో బాలాజీకు కాలు విరిగింది. రోడ్డుపై పడిన సతీష్‌కు తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. బాలాజీని జీజీహెచ్‌కు తరలించారు.

రెండు పూరిళ్లు దగ్ధం

చిలకలూరిపేటటౌన్: ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని రెండు గుడిసెలు పూర్తిగా దగ్ధమైన సంఘటన శుక్రవారం తెల్లవారు చోటు చేసుకుంది. స్థానికులు కథనం ప్రకారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ ప్రసన్నాంజనేయ స్వామి గుడి సమీపంలో పూరి గుడిసెలో మతిస్థిమితం లేని మహిళ గత కొంతకాలంగా నివసిస్తుంది. ఉక్కపోత తట్టుకోలేక ఆమె సమీపంలోని గుడిలో నిద్రించింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గుడిసెకు నిప్పంటుకొని సమీపంలో మరో గుడిసెకు మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు మంటలను అదుపులోకి తెచ్చారు. గుడిసెల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురిఅయ్యారు.

వచ్చే ఎన్నికల్లో హ్యాట్రిక్ తప్పదు

- పోటీచేసేది.. గెలిచేది నేనే
- సీటు నాదేనని సీఎం జగన్ హామీ ఇచ్చారు
- తప్పుడు ప్రచారాలను నమ్మవద్దు
- అవార్డు పొందిన వలంటీర్ల అభినందన సభలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వచ్చే 2024 ఎన్నికల్లో నరసరావుపేట నుంచి పోటీచేసేది.. గెలిచేదీ తానేనని, తప్పకుండా హాట్రిక్ సాధిస్తానని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం బాలయ్యనగర్‌లోని బీసీ కమ్యూనిటీ హాలులో 22, 23, 24 వార్డుల సచివాలయాల పరిధిలో ప్రభుత్వంచే అవార్డు పొందిన వలంటీర్లుకు నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. పల్నాడు జిల్లాలో మొట్టమొదట గెలిచే స్థానం నరసరావుపేటని, ఇటీవల తాను కలిసిన సమయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సీటు తనకేనని హామీ ఇచ్చారన్నారు. అయితే కొంతమంది తమ రాజకీయ స్వలాభం, స్వార్థం కోసం పెత్తనాలు పోయాయని పోటీ చేసేందుకు ఎవరో వస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. కార్యకర్తలు ఎవరూ అనుమానం, ఆందోళన చెందవద్దన్నారు. ఇక్కడి నుంచి తానే పోటీ చేస్తానని, మరోసారి గెలిచేది కూడా తానేనన్నారు. ప్రభుత్వం చేసిన మంచిపనులే మనకు శ్రీరామరక్ష అన్నారు. మళ్లీ రాష్ట్రానికి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రావటం ఖాయమన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రభుత్వాన్ని గడపగడపకు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పార్టీలు, కుల, మతాలకు సంబంధం లేకుండా ప్రతి ఒక్కరినీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిత్యం పలుకరిస్తుందన్నారు. గతంలో పింఛను, పథకాలు అందాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగే పనిలేకుండా వలంటీర్లు, సచివాలయం లాంటి మంచి వ్యవస్థలకు నాంది పలికారన్నారు. అవార్డులు పొందిన ప్రతి వలంటీరుకు దుశ్శాలువ కప్పి పూలమాలలు వేసి అభినందించారు. షేక్ కార్పొరేషన్ చైర్మన్ ఆషాబేగం ఖాజావలి, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఓ.శ్రీనివాసరావు, పార్టీ నాయకులు కాకుమాను సదాశివరెడ్డి, పూనూరి కోటిరెడ్డి, యన్నం శివారెడ్డి, మారూరి శివారెడ్డి, పోలూ రి వెంకటరెడ్డి, వార్డుల నాయకులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే గోపిరెడ్డి, అధికారులు

విప్పర్లపల్లిలో పర్యటించిన కలెక్టర్

క్షేత్రస్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ పరిశీలన



ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ లోతేటి

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లపల్లి గ్రామంలో శుక్రవారం గ్రామోదయ కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ పర్యటించారు. గ్రామస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలకు డాక్టర్లు పరీక్షలు నిర్వహించారు. ఆ పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడి తగు సూచనలు ఇచ్చారు. తక్కువ బరువు, తక్కువ ఎత్తు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు వారి పట్ల తీసుకోవల్సిన జాగ్రత్తలు, ఆహారం, ఆరోగ్యం పట్ల తీసుకోవల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. పాఠశాలను సందర్శించి విద్యార్థులతో సరదాగ గడిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు పాఠాల బోధనపై వివరించారు.

విద్యార్థులతో పాఠాలు చదివించారు. అలాగే వుయ్ లవ్ రీడింగ్ కార్యక్రమాన్ని పరిశీలించి సూచనలు ఇచ్చారు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కాఫీ విత్ క్లాస్ మిత్ర కార్యక్రమంలో పాల్గొని పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ, గ్రామ సర్పంచ్ గాదె రామిరెడ్డి, మండల పరిషత్ అధికారి వెంకటేశ్వరరావు, ఎండీవో కె. మాథ్యూబాబు, తహసీల్దార్ జి. అంకారావు, వైద్యాధికారి డాక్టర్ పోతిరెడ్డి జగన్‌నరసింహారెడ్డి, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, వైద్యసిబ్బంది, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

రక్తహీనత తలెత్తకుండా పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న కమిషనర్ సీహెచ్ గోవిందరావు

చిలకలూరిపేట: రక్తహీనత తలెత్తకుండా పౌష్టికాహారం తీసుకోవాలని కమిషనర్ సీహెచ్ గోవిందరావు చెప్పారు. పట్టణంలోని తొమ్మిదో వార్డు పరిధిలోని రజకకాలనీలో నగరోదయం కార్యక్రమం కింద రక్తహీనతతో ఉన్న గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను శుక్రవారం వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గర్భిణులతో పాటు ఐదేళ్లలోపు పిల్లలు వయసుకు తగ్గ బరువు, ఎత్తు లేకపోవడం గుర్తించే కార్యక్రమం చేపడుతున్నట్లు వెల్లడించారు. మున్సిపల్, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బందితో పాటు వలంటీర్లను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేసినట్లు చెప్పారు. ఇంటింటికీ సిబ్బంది తిరిగి ఆరోగ్య సమస్యలు గుర్తించడం జరుగుతుందన్నారు. రక్తహీనత కలిగిన వారు ఫోలిక్ యాసిడ్ మాత్రలు నిరంతరం తీసుకొనే విధంగా అవగాహన కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చింతపల్లి విల్సన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ ఇస్మాయిల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన తరువాతే పరిష్కారం



బోయపాలెంలోని వసుంధర మిల్లు వద్ద భూ పరిశీలన చేస్తున్న తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు సిబ్బంది

యడ్లపాడు: ఇటీవల రెవెన్యూ అధికారులకు స్పందనలో వచ్చిన ఫిర్యాదు పరిష్కారానికి చర్యలు చేపట్టారు. మండలంలోని బోయపాలెం గ్రామంలోని వసుంధర, విశ్వతేజ నూలుమిల్లుల నడుమ దశాబ్దాల కాలంగా విశాలమైన మార్గం ఉందని గ్రామస్తులు తహసీల్దార్‌కు ఫిర్యాదు అందించారు. ఇందులో భాగంగా శుక్రవారం తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సర్వేయరు రాంబాబు సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. గ్రామస్తుల స్వయంగా వచ్చి దారి వివరాలను అధికారులకు తెలియజేశారు. మిల్లు యాజమాన్యం తమవద్ద ఉన్న డాక్యుమెంట్లను కూడా పరిశీలించాలని కోరారు. బాట ఉన్నదాని కంటే ఇంకా వెనకకే తమ ప్రహరీలను నిర్మించుకుంటామని, గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగజేయమని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ వివరణ ఇస్తూ తమ వద్ద ఉన్న గ్రామ రికార్డులను, అలాగే మిల్లు వారి వద్ద ఉన్న ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలన చేసి సమస్యను పరిష్కరించనున్నట్లు తెలిపారు.